E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :282 ఆదివారం 20 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## మమతా బెనర్జీకి వరుస షాకులు!




2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నామినేషన్‌ను ఉపసంహరించుకుని రేసు నుంచి తప్పుకోగా, తాజాగా ఆ పార్టీకి మరో ఊహించని షాక్ తగిలింది. ముర్షిదాబాద్ జిల్లా పరిధిలోని రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో టీఎంసీ అధికారిక అభ్యర్థిగా బరిలోకి దిగిన రబియుల్ ఆలం చౌధురి సైతం పోటీ నుంచి తప్పుకున్నారు.

## రాజముద్రతో ఇళ్ల పట్టాలు

- పేదలకు రాజముద్రతో ఇళ్ల పట్టాలు
- అర్హులందరికీ శాశ్వత చిరునామా
- మిగిలిన వారికి త్వరలో పట్టాలు
- 35 కాలనీల్లో పట్టాల కోసం ఎదురుచూపు
- 12,149 మందికి చట్టబద్ధ పట్టాలు
- ఉత్తరాంధ్రకు భారీ పెట్టుబడుల వెల్లువ



2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన సభా ప్రాంగణానికి చేరుకోగానే లబ్ధిదారులు, సభికులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేస్తూ తమ స్థానాల్లో నిలబడి చేతులు ఊపుతూ ఘన స్వాగతం పలికారు. ప్రజల ఉత్సాహానికి ప్రతిగా సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంప్ మీద నడుస్తూ అందరికీ అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఉన్నారు.

ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. పేదలు ఎవరిపైనా ఆధారపడకుండా స్వేచ్ఛగా, గౌరవప్రదంగా బతకాలనే ఉద్దేశంతోనే రాజముద్ర వేసి మరీ ఇళ్ల పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత చిరునామా కల్పించే పూర్తి బాధ్యత తమ కూటమి ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చేశారు.

## ఉపఎన్నికపై మహేశ్ గౌడ్ క్లారిటీ!

- ఖైరతాబాద్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ సిద్ధం
- దానం పోటీపై హైకమాండ్‌దే తుది నిర్ణయం
- హైకోర్టు తీర్పును స్వాగతించిన మహేశ్ గౌడ్
- కాంగ్రెస్‌లో ఫిరాయింపులు జరగలేదని స్పష్టీకరణ
- బీఆర్ఎస్‌పైనే ఫిరాయింపుల సంస్కృతి ఆరోపణలు
- ప్రజాపాలనకు ఆకర్షితులై ఎమ్మెల్యేల మద్దతు
- ఉప ఎన్నికలో ప్రజా తీర్పుపై మహేశ్ గౌడ్ ధీమా

2 లో

## ఉత్తర తెలంగాణకు ఎయిర్‌పోర్టు బూస్ట్!

- మామునూరు ఎయిర్‌పోర్టుకు కీలక అప్డేట్
- డిసెంబరులో టెండర్లు ఖరారు
- మూడు ప్యాకేజీలుగా నిర్మాణ పనులు
- 953 ఎకరాల్లో ప్రహరీ నిర్మాణం
- రన్‌వే, పార్కింగ్ పనులకు శ్రీకారం
- టెర్మినల్, ఏటీసీ టవర్ నిర్మాణం
- రూ.213.59 కోట్లతో టెండర్లు
- 2028 జూన్ 2నాటికి పూర్తి లక్ష్యం



2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** వరంగల్ మామునూరు విమానాశ్రయంపై కీలక అప్డేట్ వచ్చింది. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలన వంటి ప్రక్రియలను దాటుకుని నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి కేంద్రానికి అప్పగించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తాజాగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి తెలిపారు. విమానాశ్రయ నిర్మాణం జరగనున్న 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు.

## ముగిసిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు!

- 8 రోజుల పాటు కొనసాగిన అసెంబ్లీ సమావేశాలు
- 51 గంటల 52 నిమిషాల పాటు సభా కార్యకలాపాలు
- 4 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం
- మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ గ్రీన్ సిగ్నల్
- తొలిరోజే అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత
- నల్ల దుస్తులతో బీఆర్ఎస్ నేతల నిరసన
- స్పీకర్‌పై వ్యాఖ్యలతో మరో వివాదం

2 లో

## టెట్ పేపర్ లీక్.. 16 మంది అరెస్ట్!

- రూ.8 వేల కోసం టెట్ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు
- షూ ఇన్సోల్స్‌లో దాచి ప్రశ్నాపత్రాల తరలింపు
- ప్రింటింగ్ ప్రెస్‌లోనే పేపర్ బయటకు తీసిన ఉద్యోగులు
- ప్రధాన సూత్రధారిగా బిజేంద్ర గుప్తా పేరు
- పరీక్షకు ఒక్కరోజు ముందు లీక్ వ్యవహారం బట్టబయలు
- 4 సెట్ల అసలైన ప్రశ్నాపత్రాలు స్వాధీనం
- 18 మందిలో 16 మంది అరెస్ట్.. ఇద్దరు పరారీ

2 లో

## యూరప్ టూర్‌కు జగన్.. సీబీఐ కోర్టు గ్రీన్ సిగ్నల్!



2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విదేశీపర్యటనకు వెళ్లనున్నారు. కుటుంబ సమేతంగా యూరప్‌లోని తన కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## సోలార్ పవర్‌లో భారత్ సరికొత్త రికార్డ్!




2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధన రంగాల్లో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రధాని.. అధికారిక 'ఎన్‌జీటీ మొబైల్ యాప్'ను లాంఛనంగా ప్రారంభించారు.

# రేవంత్ మాట దానం బాట!



**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ తాజాగా స్పందించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తాను సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది స్పీకర్ నిర్ణయించాలని వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడిన ఆయన.. తీర్పు కాపీని పూర్తిగా చదివానని తెలిపారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక జరిగితే తాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎన్నికలు తనకు కొత్త కాదని, ఎన్నికల్లో పోరాడేందుకు తాను ఇష్టపడతానని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తన కార్యకర్తలకు కూడా చెబుతున్నానన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినట్లు వెల్లడించిన దానం.. 'నువ్వు ఫైటర్‌వి.. ఫైట్ చేద్దాం' అని సీఎం చెప్పినట్లు తెలిపారు. తాను ఇదే చేస్తానని చెప్పారు.

- హైకోర్టు తీర్పుపై దానం స్పందన
- సుప్రీంకోర్టుకు వెళ్లేది లేదని స్పష్టత
- ఉప ఎన్నికకు సిద్ధమన్న ఎమ్మెల్యే
- ఎన్నికలు కొత్త కాదంటూ వ్యాఖ్యలు
- కార్యకర్తలకు ఇదే విషయం చెప్పానని వెల్లడి
- రేవంత్‌తో భేటీపై కీలక వ్యాఖ్యలు
- 'నువ్వు ఫైటర్‌వి.. ఫైట్ చేద్దాం'
- ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికపై ఆసక్తి
- అనర్హతపై హైకోర్టు కీలక తీర్పు

మిగతాది 2 లో..

## సర్కార్ బడుల్లో చికెన్ బిర్యానీ!

- ప్రభుత్వ బడుల్లో చికెన్ బిర్యానీ ప్రతిపాదన
- వారానికి ఒకసారి బిర్యానీ ఆలోచన
- పోషకాహారం కోసం కొత్త ప్రతిపాదన
- విద్యార్థుల హాజరుపై ప్రత్యేక ఫోకస్
- మాంసాహార విద్యార్థులకు ఆప్షనల్
- శాకాహారులకు పోషక భోజనం కొనసాగింపు
- ఉన్నతస్థాయి సంప్రదింపుల తర్వాత తుది నిర్ణయం
- 11, 12 తరగతులకు విస్తరణ యోచన



2 లో

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** తమిళనాడు సీఎం విజయ్ డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం (మిడ్-డే మీల్స్) కింద వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించాలనే సరికొత్త ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు, బడుల్లో వారి హాజరు శాతాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో ఈ ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు విద్యాశాఖ మంత్రి వెల్లడించారు. తమిళనాడు చరిత్రలో విద్యా విప్లవం ఎప్పుడు పోషకాహార విప్లవంతో కలిసే సాగిందని, అందులో భాగంగానే విద్యార్థులకు మరింత బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు ఈ సరికొత్త ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

## జెడ్పీలపై కలెక్టర్లకు పగ్గాలు!

- జెడ్పీ, ఎంపీపీలకు ప్రత్యేక పాలన
- సెప్టెంబర్ 25 నుంచి జెడ్పీలకు
- కలెక్టర్లకు ప్రత్యేక అధికార బాధ్యతలు
- ఆరు నెలల వరకు పాలనకు అవకాశం
- సెప్టెంబర్ 24 నుంచి ఎంపీపీలకు
- జిల్లా అధికారులకు కీలక బాధ్యతలు
- కొత్త జెడ్పీల పునర్వ్యవస్థీకరణకు కసరత్తు
- స్థానిక ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది.. రాష్ట్రంలోని జిల్లా ప్రజా పరిషత్‌లు, మండల ప్రజా పరిషత్‌లు త్వరలో ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ప్రస్తుత జెడ్పీ, మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించి వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టే వరకు ఈ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 24వ తేదీతో ముగియనుంది.

2 లో

# ఉపఎన్నికపై మహేశ్ గౌడ్ క్లారిటీ!





**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి కాదని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి లభించిన తీవ్ర చెంపపెట్టని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, దానం నాగేందర్ వ్యవహారం, తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పష్టత ఇచ్చారు. దానం నాగేందర్ వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి పార్టీ ఫిరాయింపులు జరగలేదని స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మాత్రమే ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు.

ఉప ఎన్నికకు సిద్ధం..

ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తారా లేదా అన్నది కాంగ్రెస్ పార్టీ అధిష్టానం (హైకమాండ్) పరిశీలించి నిర్ణయిస్తుందని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల సంస్కృతిని తెలంగాణలో ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలను ఏ విధంగా కొనుగోలు చేసే తమ పార్టీలో విలీనం చేసుకున్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని గుర్తుచేశారు. అటువంటి అక్రమాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఉప ఎన్నికలలో ప్రజా తీర్పు మళ్లీ తమకే అనుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# టెట్ పేపర్ లీక్.. 16 మంది అరెస్ట్!



**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం రూ.8 వేలకు కక్కుర్తి పడి లక్షల మంది ప్రభావితమయ్యే ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసినట్లు గుర్తించారు. ఆగ్రా ప్రింటింగ్ ప్రెస్ నుంచి సెక్యూరిటీ కళ్లకప్పి షూ ఇన్సోల్స్‌లో దాచి ఇద్దరు ఉద్యోగులు ప్రశ్నాపత్రాలను బయటకు తెచ్చినట్లు థానే సిటీ పోలీసులు భివాండీ కోర్టులో దాఖలు చేసిన దాదాపు 3,500 పేజీల చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఈ కుట్ర వెనుక ప్రధాన సూత్రధారి బిజేంద్ర గుప్తా అని, గతంలో ఈయన ఒడిశా పేపర్ లీక్ కేసులో కూడా నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. మొత్తం 18 మంది నిందితుల్లో ఇప్పటివరకు 16 మందిని అరెస్ట్ చేయగా అశోక్ సావ్, ప్రకాష్ మిసాల్ అనే ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పరీక్షకు ఒక్కరోజు ముందు గుట్టురట్టు:

ఈ ఏడాది జూన్ 28న జరగాల్సిన పరీక్షకు ఒక్క రోజు ముందు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పవన్ బన్సోడ్‌కు వచ్చిన రహస్య సమాచారంతో ఈ ప్రశ్నాపత్రం లీకేజీ రాకెట్ గుట్టురట్టయింది. భివాండీ నివాసికి పేపర్లు విక్రయించేందుకు యత్నిస్తుండగా కొంగావ్ ప్రాంతంలో పోలీసులు డెకాయ్ బృందంతో వల పన్ని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద లభించిన 4 సెట్ల ప్రశ్నాపత్రాలను మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులతో సరిచూడగా అవి అసలైనవిగా నిర్ధారణ అయ్యాయి. దీంతో టెట్ పరీక్షను అధికారులు వాయిదా వేశారు. ఈ ఘటనపై ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ థాణె జాయింట్ సీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు ఆదేశించారు. విచారణ జరిపిన అధికారులు తాజాగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

# అసెంబ్లీ సమావేశాలకు తెర

మొదటి పేజీ తరువాయి



న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం): తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం స్పీకర్.. అసెంబ్లీని నిరవధిక వాయిదా వేశారు. మొత్తం 8 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించగా.. 51 గంటల 52 నిమిషాలపాటు సభ సజావుగా సాగింది. ఈ సమావేశాల్లో 4 బిల్లులకు, మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది.

మొదటిరోజు అలా..

సెప్టెంబర్ 7వ తేదీన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవ్వగా.. తొలిరోజే.. అసెంబ్లీ గేటు వద్ద తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ నేతలంతా నల్లచొక్కాలు, చీరలతో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడం ఆందోళనకు దారితీసింది. షర్టులపై ఎలాంటి రాతలు ఉండకూడదంటూ పోలీసులు అడ్డుకోవడం, బీఆర్ఎస్ మహిళా నేతలపై దాడిచేసిన ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ పై తాతా మధు చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి కారణమయ్యాయి.

## యూరప్ టూర్‌కు జగన్.. సీబీఐ కోర్టు గ్రీన్ సిగ్నల్!



**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విదేశీపర్యటనకు వెళ్లనున్నారు. కుటుంబ సమేతంగా యూరప్‌లోని తన కుమార్తెల వద్దకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఆయన నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానకు 15 రోజుల పర్యటనకు షరతులతో కూడిన అనుమతిచ్చింది. కోర్టు ఆదేశాల ప్రకారం అక్టోబర్ 1 నుండి నవంబర్ 30వ తేదీ మధ్య 15 రోజుల వ్యవధిలోనే జగన్ యూరప్ పర్యటనను ముగించుకోవాల్సి ఉంటుంది.

అంతేకాకుండా పర్యటనకు బయలుదేరే ముందే సమగ్ర ప్రయాణ ప్రణాళికను కోర్టుకు, సీబీఐ అధికారులకు సమర్పించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. విదేశీ పర్యటనలో అందుబాటులో ఉండే ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ వివరాలు సైతం దర్యాప్తు సంస్థకు తప్పనిసరిగా అందించాలని షరతులు విధించింది. ఇదిలా ఉంటే రాజకీయాల్లో ఫుల్ బిజీగా ఉండే జగన్ అప్పుడప్పుడూ విదేశీపర్యటనలకు వెళుతుంటారు. ముఖ్యంగా ఆయన తమ కుమార్తెలు విదేశాల్లో చదువుతుండటంతో కుటుంబ సమేతంగా అక్కడికే వెళ్లి వస్తుంటారు.

# మమతా బెనర్జీకి వరుస షాకులు!

**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గంలో టీఎంసీ అభ్యర్థి సంచితా ప్రధాన్ నామినేషన్‌ను ఉపసంహరించుకుని రేసు నుంచి తప్పుకోగా, తాజాగా ఆ పార్టీకి మరో ఊహించని షాక్ తగిలింది. ముర్షిదాబాద్ జిల్లా పరిధిలోని రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో టీఎంసీ అధికారిక అభ్యర్థిగా బరిలోకి దిగిన రబియుల్ ఆలం చౌధురి సైతం పోటీ నుంచి తప్పుకున్నారు. చివరి క్షణంలో ఆయన తన నామినేషన్‌ను అధికారికంగా విత్‌డ్రా చేసుకోవడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. వరుసగా రెండో రోజు కూడా తమ అభ్యర్థి పోటీ నుంచి వైదొలగడం తో పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశ లో మునిగిపోయాయి.

నందిగ్రామ్‌లో తమ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ తర్వాత బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ఇస్తున్నట్లు మమతా బెనర్జీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఆయనను పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఆ పరిణామం సద్దుమణగక ముందే రెజీనగర్‌లోనూ రబియుల్ ఆలం చౌధురి పోటీ నుంచి తప్పుకోవడం రాజకీయ సమీకరణాలను మరింత వేడెక్కించింది. ఇండియా కూటమిలో అంతర్గత సమన్వయం కోసమే ఈ ఉపసంహరణలు జరుగుతున్నాయా లేక అంతర్గత కుమ్ములాటల వల్ల నేతలు పోటీ నుంచి తప్పుకుంటున్నారా అనే దానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. ఉప ఎన్నికల ముంగిట ముఖ్యమైన స్థానాల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు ఇలా వరుసగా వెనక్కి తగ్గడం అధికార బీజేపీకి సరికొత్త రాజకీయ అస్త్రాన్ని అందించినట్లయిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# సోలార్ పవర్‌లో భారత్ సరికొత్త రికార్డ్!




**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధన రంగాల్లో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్' అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రధాని.. అధికారిక 'ఎన్‌జీటీ మొబైల్ యాప్'ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిస్ ఒప్పందం లక్ష్యాలను గడువు కంటే ముందే పూర్తి చేసిన ఏకైక జీ20 దేశం భారతదేశమేనని గర్వంగా ప్రకటించారు.

గత 12 ఏళ్లలో దేశ సౌర విద్యుత్ సామర్థ్యం 2 గిగావాట్ల నుంచి ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని, పవన విద్యుత్ మూడు రెట్లు విస్తరించిందని తెలిపారు. 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన' ద్వారా 50 లక్షలకు పైగా ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చి రూ.80 వేల వరకు ఆర్థిక సాయం అందించామని, 'పీఎం కుసుమ్' కింద 30 లక్షల మంది రైతులకు సోలార్ పంపులు సమకూర్చామని వెల్లడించారు. సౌరశక్తి ద్వారానే దాదాపు 20 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించామని, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 950 రెట్లు ఎగబాకిందని పేర్కొన్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలపై కర్బన ఉద్గారాల నెపాన్ని మోపే ధోరణిని ప్రధాని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. భారత్‌తో పోలిస్తే సంపన్న, అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కర్బన ఉద్గారాలు ఆరు రెట్లు అధికంగా ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. నేటికీ అంతర్జాతీయ సగటుతో పోలిస్తే భారతదేశ తలసరి ఉద్గారాలు సగం కంటే తక్కువగానే ఉన్నాయనే చారిత్రక వాస్తవాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలని తేల్చిచెప్పారు. అణు విద్యుత్ ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తుంటే పర్యావరణం గురించి సుదీర్ఘ ప్రసంగాలు ఇచ్చేవారే కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పరోక్షంగా విమర్శించారు.

అంతర్జాతీయ సౌర కూటమి, మిషన్ లైఫ్, గ్లోబల్ బయోఫ్యూయల్ అలయన్స్, 'వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్' వంటి వినూత్న వేదికల ద్వారా ఆధునిక వాతావరణ సవాళ్లకు భారత్ ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తోందని, ప్రకృతిని కాపాడుకోవడంలో ప్రపంచమంతా ఐక్యంగా కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

# సర్కార్ బడుల్లో చికెన్ బిర్యానీ!


మొదటి పేజీ తరువాయి

ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోందని, సాంఘిక సంక్షేమ శాఖ తో పాటు ఉన్నత స్థాయి సంప్రదింపుల అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనపై పలు వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. శాకాహారం మాత్రమే తినే విద్యార్థులకు యథావిధిగా పౌష్టిక శాకాహార భోజనమే కొనసాగుతుందని, కేవలం మాంసాహారం తినే పిల్లలకు మాత్రమే ఆప్షనల్ ప్రాతిపదికన చికెన్ బిర్యానీని వడ్డిస్తారని స్పష్టం చేశారు. ఎదుగుతున్న పిల్లలకు అవసరమైన ప్రొటీన్లు అందించడం అత్యంత ఆవశ్యకమని, దీనిని ఎవరూ రాజకీయం చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ప్రస్తుతం ఉన్న పథకాన్ని 11, 12వ తరగతి విద్యార్థులకు కూడా విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# జెడ్పీలపై కలెక్టర్లకు పగ్గాలు!

మొదటి పేజీ తరువాయి




దీంతో సెప్టెంబర్ 25వ తేదీ నుంచి జెడ్పీల పరిపాలన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగనుంది. జెడ్పీలకు సంబంధిత జిల్లా కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈ పాలన ఆరు నెలల వరకు కొనసాగించే అవకాశం ఉంది. అయితే అంతకంటే ముందే కొత్తగా ఎన్నికైన జెడ్పీ పాలకవర్గాలు బాధ్యతలు చేపడితే, ప్రత్యేక అధికారుల పాలన ముగియనుంది.

ఇక, మండల ప్రజా పరిషత్‌ల విషయానికి వస్తే.. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం సెప్టెంబర్ 23వ తేదీతో ముగియనుంది. సెప్టెంబర్ 24వ తేదీ నుంచి మండల పరిషత్‌లు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. మండల పరిషత్‌లకు జిల్లా స్థాయి అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు, ఆర్డీవోలు తదితర అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించే అవకాశం ఉంది. మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులుగా ఎంపికయ్యే అధికారులు.. సంబంధిత ఎంపీడీవో కంటే కనీసం ఒక ర్యాంకు పైస్థాయిలో ఉన్నవారై ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఎన్నికైన కొత్త మండల పరిషత్ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టే వరకు వీరు పరిపాలనను పర్యవేక్షించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, కొత్తగా ఎన్నికైన సభ్యులు, అధ్యక్షులు బాధ్యతలు చేపట్టే వరకు ప్రత్యేక అధికారి పరిషత్ అధికారాలు, విధులను నిర్వహించే అవకాశం ఉంది.

మరోవైపు, రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా జెడ్పీల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. గతంలో ఉన్న 13 జెడ్పీల స్థానంలో 28 జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత ఈ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కొత్త జెడ్పీ వ్యవస్థ అమల్లోకి రానుంది. ఇదిలా ఉండగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. పూర్తి స్థాయి ఫొటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించింది. దీంతో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

# రాజముద్రతో ఇళ్ల పట్టాలు

మొదటి పేజీ తరువాయి

అంతే కాకుండా.. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరలోనే పట్టాలు అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం మరో 35 కాలనీల్లో పది వేల మంది ఇళ్ల పట్టాలు కోరుతున్నారని, అలాగే దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో మొత్తం 12,149 మందికి చట్టబద్ధంగా పట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు దక్కేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం చంద్రబాబు విశాఖపట్నంలో కీలక ప్రకటనలు చేశారు. ఈ ప్రాంతానికి రెండేళ్లలో 91 కొత్త ప్రాజెక్టుల ద్వారా ఐదు లక్షల ముప్పై ఏడు వేల కోట్ల భారీ పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పూర్తి చేసి అనకాపల్లికి నీళ్లు తీసుకువచ్చామని, త్వరలోనే విశాఖకు గోదావరి జలాలు అందిస్తామని స్పష్టం చేశారు. అల్లూరి విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర ప్రజల కలలు నెరవేరాయన్నారు. విశాఖకు కొత్తగా హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు వచ్చాయని, భవిష్యత్తులో ఇది అగ్రగామి టూరిజం, లాజిస్టిక్స్ హబ్‌గా మారుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

# ఉత్తర తెలంగాణకు ఎయిర్‌పోర్టు బూస్ట్!

మొదటి పేజీ తరువాయి

రెండో ప్యాకేజీలో రన్‌వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ వంటి కీలక మౌలిక వసతుల నిర్మాణం చేపట్టనున్నారు. మూడో ప్యాకేజీలో టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ వంటి ప్రధాన సదుపాయాలు రానున్నాయి.

టెర్మినల్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ తదితర పనులకు రూ.213.59 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచే ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో జరిగిన సమావేశంలో మామునూరు టెండర్లను వేగవంతం చేయాలని నిర్ణయించారు. టెండర్లు డిసెంబరులో ఖరారు చేసి అదే నెలలో శంకుస్థాపన పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మామునూరు విమానాశ్రయాన్ని ఉత్తర తెలంగాణకు కీలకమైన విమానయాన కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. వరంగల్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ప్రాంతాలకు కూడా ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పారిశ్రామిక సంస్థలకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పించడంతో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి మామునూరు విమానాశ్రయ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని వివరించారు. కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్ఓ, హ్యాంగర్ సదుపాయాలను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయాన్ని 2028 జూన్ 2 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు భూసేకరణలో పురోగతి..

ఇక ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని రక్షణ, పౌర విమానయాన అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. జూన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విమానాశ్రయానికి పౌర ప్రయాణికుల టెర్మినల్‌తో పాటు కార్గో, ఎంఆర్ఓ, హ్యాంగర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. సెప్టెంబరు నాటికి రాష్ట్ర ప్రభుత్వం 750 ఎకరాల భూమిని సమీకరించిందని, రక్షణ శాఖ కోరిన మేరకు మరో 750 ఎకరాలు సమీకరించేందుకు సిద్ధంగా ఉందని సీఎం రక్షణ మంత్రికి తెలిపారు.

కొత్తగూడెం విమానాశ్రయం.. ఇంకా ప్రతిపాదన దశలోనే..

కొత్తగూడెం విమానాశ్రయాన్ని కూడా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉంది. గతేడాదే ప్రభుత్వం వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం విమానాశ్రయాలపై కార్యాచరణను వేగవంతం చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర పౌర విమానయాన మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం కొత్తగూడెం ప్రతిపాదన అప్పటి సాధ్యత ప్రమాణాలను అందుకోలేదు. తాజా రాష్ట్ర ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళికలోనూ కొత్తగూడెం ప్రాంతానికి ప్రాంతీయ విమానాశ్రయ ప్రతిపాదన కొనసాగుతోంది. అయితే మామునూరు మాదిరిగా నిర్మాణ టెండర్లు పిలవలేదు. అక్కడ ఏర్పాటు చేసే విషయంపై అనుకూలతలను పరిశీలిస్తున్నారు.

# రేవంత్ మాట.. దానం బాట!


మొదటి పేజీ తరువాయి

కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ తరఫున 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ పరిణామాన్ని ఆధారంగా చేసుకుని ఆయనపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి 2024 మార్చి 18న అసెంబ్లీ స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా 2024 జూలై 1న స్పీకర్‌ను ఆశ్రయించారు. పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు 2025 జూలై 31న స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ.. సీఎం పాత్రలో తలసాని

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ విచారణ చేపట్టారు. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుకు పాల్పడలేదని అందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు పూర్తయ్యాక హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.. సెప్టెంబర్ 18న తుది తీర్పు వెలువరించింది. స్పీకర్ నిర్ణయాన్ని కొట్టివేసిన హైకోర్టు.. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి అనర్హుడని ప్రకటించింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించి, తీర్పు ప్రతిని అసెంబ్లీ స్పీకర్, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశించింది. కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన తేదీ నుంచే ఆయనపై అనర్హత వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో తన అనర్హత విషయంపై తాజాగా దానం నాగేందర్ స్పందించారు.

# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు




**న్యూస్ డెస్క్, 19 సెప్టెంబరు (తెలుగు గళం):** కృష్ణా జలాల్లో మన వాటా వాడుకోవడంలో తెలంగాణ పూర్తిగా విఫలం అయిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. 2024, 2025 లో కృష్ణానది జలాల్లో అత్యధిక నీళ్లు వాడుకున్నామని నిన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు .కానీ ఈ మూడేళ్లలో తెలంగాణ అతి తక్కువ వాడుకున్నట్లు కేఆర్ఎంబీ లెక్కలు చెబుతున్నాయన్నారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ ఏడాది శ్రీశైలంలో ఇప్పటికే 84 టీఎంసీలు తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారని కల్వకుర్తికి ఇప్పటి వరకు కేవలం 8 టీఎంసీలు ఎత్తిపి 84 టీఎంసీలు అని చెప్పారని మండిపడ్డారు. కల్వకుర్తికి నీళ్లు ఎత్తిపోసే వెల్లూరు 5 మోటార్లకు గాను కేవలం 2 మోటార్లు నడుపుతున్నారని మరో వైపు ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండకు నీళ్లు తరలించుకుపోతోందన్నారు. ఈ మూడేళ్లలో ఏపీ 718 టీఎంసీలు వాడితే తెలంగాణ కేవలం 216 టీఎంసీలు వాడిందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అతి తక్కువ వినియోగం 2024-2025 లో జరిగిందని 2025-26లో కేవలం 25 శాతం నీళ్లు మాత్రమే వాడుకున్నదని ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నాయని మోటార్లు సిద్ధంగా ఉన్నాయని అయినా ప్రభుత్వం నీళ్లు ఎత్తడం లేదన్నారు.

## పాండ్యాల అంజయ్య కుటుంబాన్ని పరామర్శించిన సీపీఎం నేతలు

తెలుగు గళం న్యూస్
తరిగొప్పుల, సెప్టెంబర్ 19



తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన సీపీఎం మండల కార్యదర్శి పాండ్యాల అంజయ్య మాతృమూర్తి పాండ్యాల సోమమ్మ వృద్ధాప్యంతో ఇటీవల మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు అంజయ్య నివాసానికి వెళ్లి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ ఆధ్వర్యంలో నాయకులు సోమమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె మృతికి సంతాపం తెలిపారు. అంజయ్య కుటుంబ సభ్యులకు సీపీఎం జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం చిల్పూర్ మండల నాయకులు, సీఐటీయూ మండల కన్వీనర్ అపరాధపు రాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఊరడి లింగయ్య, కర్రె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కనపర్తి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



తెలుగు గళం న్యూస్ ఐనవోలు/సెప్టెంబర్ 19

హన్మకొండ జిల్లా:వనమాల కనపర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షత వహించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు.అనంతరం పాఠశాల ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలపై చర్చించారు. రానున్న ఎస్ఏ-1 పరీక్షలకు పిల్లలు ఎలా సిద్ధం కావాలి, ప్రాజెక్టు పనులు ఎలా చేయాలి అనే అంశాలపై తల్లిదండ్రుల తరఫున రాకేష్ వివరించారు.జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వర్ణ రవి, గ్రామ శాఖ అధ్యక్షులు మానుపాటి రాజు,3వ వార్డు సభ్యులు నాతి రవళిక రాజు, దూసరి వెంకటయ్య, మెరుగు రవీందర్, నాతి బుచ్చాలు, సింగారపు ఎల్లయ్య, రిపీక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## వాటర్ ట్యాంకుల శుభ్రత -సర్పంచ్ కనుకయ్య యాదవ్ చొరవ

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/సెప్టెంబర్ 19



వరంగల్ జిల్లా:పర్వతగిరి జమాల్ పురం: గ్రామ సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5:30 గంటలకే మిషన్ భగీరథ నీరు ఇవ్వడం జరుగుతుందని,కాబట్టి గ్రామస్తులు మొదట వచ్చే భగీరథ నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు.ఆ తర్వాత బావి నీరు వస్తుందని తెలిపారు.నీటి పరీక్షల్లో మినరల్ వాటర్ కంటే మిషన్ భగీరథ నీరే స్వచ్ఛమైనదిగా తేలిందని, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన,సురక్షితమైన తాగునీరు అందించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.ప్రజలందరూ గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడి కేంద్రాల్లో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ..

### పిల్లలకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత తప్పనిసరి పాత్రపురం సర్పంచ్ బొగ్గుల పుష్పవతి



తెలుగు గళం వెంకటాపురం (నూగూరు), సెప్టెంబర్ 19:

ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాత్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను శనివారం సర్పంచ్ బొగ్గుల పుష్పవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు, గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పిల్లలకు వండిన ఆహారాన్ని పరిశీలించిన అనంతరం వారితో కలిసి సర్పంచ్ భోజనం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలకు భోజనం పెట్టే ముందు చేతులను శుభ్రంగా కడిగించాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. ఆహారం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుశాంతల, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## సేవా నగర్‌లో ఘనంగా కుంకుమ పూజ



తెలుగు గళం న్యూస్
మహబూబాబాద్ జిల్లా.

సేవా నగర్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సేవా నగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద మహిళలచే కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా నగర్‌తో పాటు మరిపెడకు చెందిన పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సేవా నగర్ వినాయక అసోసియేషన్ సభ్యులు రెంటాల యాకయ్య, ములక అన్వేష్, సేవా నగర్ పెద్దలు పాల్గొన్నారు.



### అన్నదానానికి ఆహ్వానం

సేవా నగర్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేపు ఆదివారం సాయంత్రం ఏడు గంటలకి వినాయకుని వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు, సేవా నగర్ ప్రజలు, మరిపెడ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్నివి విజయవంతం చేయాలని అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు

### మొక్కలు నాటి..స్ట్రీట్ వెండర్లకు గొడుగులు..అనాథ పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్ సెప్టెంబర్ 19







లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జఫర్‌గడ్ ఆధ్వర్యంలో పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, డాక్టర్ రాజేశ్వరి దంపతుల పుట్టినరోజు సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.పుట్టినరోజు వేడుకలను సామాజిక సేవతో ముడిపెట్టి పర్యావరణ పరిరక్షణ, నిరుపేదలకు సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను చేపట్టారు.తమ్మడపల్లి జి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో 40 మొక్కలను నాటారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, సీతారాములు అనుమతితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మామిడాల పూర్ణచందర్ సూచించారు.అదేవిధంగా పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఇంటి ఆవరణలో పడే వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడం వల్ల భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతుందని వివరించారు. ఇంకుడు గుంత నిర్మాణ విధానానికి సంబంధించిన సమాచార పత్రాలను విద్యార్థులు, తల్లిదండ్రులకు అందజేశారు.జఫర్‌గడ్ కూడలిలో రోడ్డు పక్కన వ్యాపారాలు నిర్వహించే స్ట్రీట్ వెండర్లకు గొడుగులను పంపిణీ చేశారు. సర్పంచ్ కుల్ల మోహన్‌రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఎండ, వర్షాల మధ్య వ్యాపారాలు నిర్వహించే వారికి గొడుగులు అందించడం మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు.మా ఇల్లు అనాథాశ్రమంలోని చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేసి పుట్టినరోజు వేడుకలను చిన్నారుల మధ్య నిర్వహించారు.చిన్నారులతో ఆనందాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు, కీసరబోయిన రాజు, వీరమల్ల కిరణ్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ రేవూరి రమేష్, పీఆర్వో బోనగిరి శ్రవణ్‌కుమార్, డైరెక్టర్లు కూరపాటి రాజు, ముక్కల భాస్కర్‌రెడ్డి, ప్రాన్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులు మాదా శ్రీధర్, అంచూర్ యుగంధర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జయలక్ష్మీపురం పాఠశాలలో సేవా కార్యక్రమాలు”

### మొక్కలు నాటి,విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్ గడిపర్తి’

సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్19(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల జయలక్ష్మీపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గడిపర్తి శ్రీనివాసరావు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుగా తను నాటి ప్రారంభించారు.






అనంతరం వార్డు సభ్యులు మొక్కలు నాటారు.తరువాత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గడిపర్తి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కార్పోరేట్ తరహాలో బలోపేతం చేయడం కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని పేద విద్యార్థుల మేధాశక్తి పెరుగుదలకు ఉదయం అల్పాహారాన్ని సైతం ఏర్పాటు చేసిందని అన్నారు.విద్యార్థులను అల్పాహారం మెనూ అడిగి తెలుసుకున్నారు.అల్పాహారం రుచిగా ఉంటుందా అని గడిపర్తి చిన్నారులను అడగగా బావుంటుంది అని చిన్నారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో: పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకాంత్,రసీదు బేగం,ఉప సర్పంచ్ నకరికంటి జయరాజు,వార్డు సభ్యులు వేల్పుల భూలక్ష్మి,రావూరి ధనమ్మ,రావూరి వెంకటేశ్వరరావు,కోట కృష్ణ,వేల్పుల వెంకటేశ్వరరావు,గ్రామ పంచాయతీ కార్మికులు,మిడ్ డే మీల్స్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీహెచ్ఎస్ లో హిందీ దివాస్ వేడుకలు

స్టేషన్ ఘనపూర్ తెలుగుగళం సెప్టెంబర్ 19:



స్టేషన్ ఘనపూర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ లో హిందీ దివాస్ మహోత్సవం సందర్భంలో కవి పరిచయాలు ,కవితలు, ఉపన్యాసాలు, నాటకాలు, నృత్యాలు , ఎన్నో సంస్కృత కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. హిందీ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ వారు మరియు వనిత ప్లాటినం క్లబ్ వారు సన్మానించారు.ఆ పాఠశాల సీనియర్ హిందీ ఉపాధ్యాయిని రాగమణి దంపతులు స్వామి పాఠశాలకు 5 వేల విలువ గల,రంగస్థల తెర మరియు కార్పెట్ ను బహుకరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం. సంపత్ కుమార్, రవి కుమార్, శ్రీకాంత్, రాగమణి,మంజుల, రజని, శైలజ, జలజ, కరుణాకర్ పాల్గొన్నారు.

## తీన్మార్ యూత్‌కు టీషర్టులు అందజేత

### యువతను ప్రోత్సహించడమే నా లక్ష్యం : బీఆర్ఎస్ నాయకులు మందపాటి మహేశ్వరరెడ్డి’



సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్19(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం భరణిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో తీన్మార్ యూత్ సభ్యులు 45 మందికి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మందపాటి మహేశ్వరరెడ్డి టీషర్టులను పంపిణీ చేశారు.మేస్త్రీ పరిగడపు విజయ్ తమ బృందంకు టీషర్టులను పంపిణీ చేసిన మహేశ్వరరెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో తనవంతు సహాయంగా టీషర్టులను స్పాన్సర్ చేశానని మందపాటి మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు.యువత ఐక్యతగా ఉంటూ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవసరమైన సహకారం అందించడం ద్వారా వారిలో ఉత్సాహాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. యువత కోసం చేపట్టే ఇలాంటి కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా టీషర్టులు స్పాన్సర్ చేసిన మందపాటి మహేశ్వరరెడ్డికి తీన్మార్ యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో: మాజీ సర్పంచ్ బోయ ఏసు,షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## మంగపేటలో ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు

### అండర్--14, అండర్--17 విభాగాల్లో విద్యార్థుల ప్రతిభ ఈ నెల 28న జిల్లా స్థాయి ఎంపికలు



తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 19:

మంగపేట మండలంలో ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. అండర్--14, అండర్--17 బాలబాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 28న జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారిణి పొడెం మేనక తెలిపారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు అవసరమైన క్రీడా సామగ్రి, ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి హాజరు కావాలని సూచించారు. జిల్లా స్థాయి ఎంపికకు అర్హత సాధించిన విద్యార్థులను ఆమె అభినందిస్తూ, తదుపరి స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీలు నరేష్, నాగేందర్, వెంకటేశ్వర్లు, వి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కాకర్లపల్లి వాసి చందుకుఎంపీ వద్దిరాజు చేయూత”



సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్19(తెలుగు గళం) న్యూస్:

అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి వాస్తవ్యులు నంది కృష్ణయ్య కుమారుడు చందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చేయూతనం దించారు.కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చందు సహాయం కోసం ఎంపీ రవిచంద్రను కలిశారు.ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి మరింత మెరుగైన వైద్య సాయం కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి 3లక్షల రూపాయల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఏల్వోసీ) మంజూరు చేయించారు.ఎంపీ వద్దిరాజు శనివారం ఇందుకు సంబంధించిన పత్రాన్ని చందుకు అందజేసి త్వరితగతిన కోలుకుని నిండూనూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ తన ఆశీర్వదించారు.

## గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు







సత్తుపల్లి,సెప్టెంబర్ 19 (తెలుగుగళం)న్యూస్: సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ఇంజనీరింగ్ విభాగాల నూతన విద్యార్థుల స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలకడం, వారిలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందించడం స్వాగత వేడుకల ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలిగి, చదువులో ఒకరికొకరు సహకరించుకుంటూ నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యను కష్టపడి అభ్యసిస్తే ఉన్నత భవిష్యత్తు సొంతమవుతుందని సూచించారు.కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన విద్యా ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రధానాచార్యుడు డాక్టర్ షేక్ యాకూబ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల కష్టకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోంది..

**పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ అండగా సీఎం రిలీఫ్ ఫండ్.**
**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం.**
**సీఎంఆర్ఎఫ్ చెక్కు లు అందజేసిన ప్రభుత్వ విప్.**
**ప్రభుత్వ విప్,డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్ర నాయక్**



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మండలంలో గత కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న వారికీ డోర్నకల్ శాసనసభ్యులు,డాక్టర్ రామచంద్ర నాయక్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరిగింది.. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని, ప్రజల కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని,సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ రాజకీయ కురువృద్ధుడు,మాజీ శాసనసభ్యులు రామసహాయం సురేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పెండ్లి రఘువీర్ రెడ్డి,యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మరిపెడ టౌన్ అధ్యక్షులు బానోత్ రామ్ లాల్,వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్,కౌన్సిలర్లు జాటోత్ సురేష్ నాయక్,మెరుగు రాము,గంట్ల గౌతమ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,షేక్ తాజోద్దీన్,షేక్ అఫ్జల్,గంధసిరి బిక్షపతి గౌడ్,విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పప్పు ధాన్యాలలో శరీర నిర్మాణానికి ఉపయోగపడే మాంస కృతులు ఉంటాయి

**: బి.సత్యవతి(ఐసీడీఎస్ సిడిపిఓ)**



సత్తుపల్లి/వేంసూరు, సెప్టెంబర్19(తెలుగు గళం) న్యూస్:

సత్తుపల్లి ప్రాజెక్టు పరిధిలోని వేంసూరు మండలశీలో గల వెంకటాపురం సెక్టార్ లోని వెంకటాపురం గ్రామ నాలుగో అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం సందర్భంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీడీపీఓ బి. సత్యవతి పాల్గొని మాట్లాడుతూ పప్పు ధాన్యాల్లోని మాంసకృత్తులు శరీర నిర్మాణానికి, ఆకుకూరలు, కూరగాయల్లోని విటమిన్లు శరీర రక్షణకు ఉపయోగపడతాయని తెలిపారు.నీటిలో కరిగే బి, సి విటమిన్లతో పాటు కొవ్వులో కరిగే ఏ, డి, ఈ, కె విటమిన్లు ఆరోగ్యానికి అవసరమన్నారు. మొలకెత్తిన గింజలు, గుగ్గిళ్లు పిల్లలకు అందించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సెక్టార్ సూపర్‌వైజర్ వసంత సూచించారు.గ్రామ సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ సమీకృత శిశు అభివృద్ధి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం, ఒక చిన్నారికి అన్నప్రాశన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో: పల్లె దవాఖాన వైద్యుడు శ్రీహర్ష, ఆశా కార్యకర్త ప్రమీల, అంగన్వాడీ ఉపాధ్యాయులు శివమ్మ, పద్మ, విజయ, నాగేంద్ర, రాధారాణి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

# యువ టూరిజం క్లబ్ పోటీల్లో విద్యార్థుల ఉత్సాహం

**టూరిజంపై అవగాహన కల్పించేలా సృజనాత్మక ప్రదర్శనలు**
**జిల్లా స్థాయి పోటీలకు మంగపేట విద్యార్థుల ఎంపిక**





తెలుగు గళం మంగపేట, సెప్టెంబర్ 19:

ములుగు జిల్లా మంగపేట మండలంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు టూరిజంపై అవగాహన కల్పించేలా స్కిట్లు, పాటలు, నాటకాలు, కళలు––హస్తకళలు, వినూత్న ఆలోచనలు, పోస్టర్ తయారీ, టూరిజం ప్రజెంటేషన్ తదితర విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. జడ్పీహెచ్ఎస్ రాజుపేట, జడ్పీహెచ్ఎస్ మల్లూరు, జడ్పీహెచ్ఎస్ మంగపేట, జడ్పీహెచ్ఎస్ కమలాపురం, కేజీబీవీ మంగపేట, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర విద్యాసంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొని సృజనాత్మకతను చాటుకున్నారు. పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యత, స్థానిక సంస్కృతి, కళలు, సంప్రదాయాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాధికారిణి పొడెం మేనక అభినందించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు సోమవారం, మంగళవారం జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మంగపేట మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సంతోష్ కుమార్, రవీందర్, సూర్య, జమునతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శంకరాజుపల్లిలో పోషణ మాసం కార్యక్రమం

**పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు**
**గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై అవగాహన**



తెలుగు గళం శంకరాజుపల్లి/ ఏటూరునాగారం, సెప్టెంబర్ 19:

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి--2 అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ రజిత ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శరీరానికి శక్తి, రక్షణ, పెరుగుదలకు అవసరమైన మొక్కజొన్న, గోధుమలు, పప్పుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, చేపలు, గుడ్లు, పాలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆహారంలో ఐరన్ సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దుర్గం భారతి, తోటపల్లి లక్ష్మి, సోలం లక్ష్మి నర్సమ్మతో పాటు గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం గరిమెళ్ల వెంకటేశ్వరరావు 36వ వర్ధంతి"





అశ్వారావుపేట/దమ్మపేట, సెప్టెంబర్ 19 (తెలుగుగళం) న్యూస్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో సీపీఎం పార్టీ నాయకులు అమరజీవి కామ్రేడ్ గరిమెళ్ల వెంకటేశ్వరరావు 36వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు మోరంపూడి కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ ముఖ్యఅతిథిగా హాజరై గరిమెళ్ల స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు గరిమెళ్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, మోరంపూడి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ గరిమెళ్ల వెంకటేశ్వరరావు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, జీవితాంతం ఎర్రజెండాను భుజాన వేసుకుని కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం వర్గ పోరాటాలు నిర్వహించారని తెలిపారు. నాలుగు దశాబ్దాల క్రితం భూస్వాములు, పెత్తందారుల దాడులకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన నిలిచి వారికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ ప్రాంతంలో సీపీఎం పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. గరిమెళ్ల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో: శ్రీరాంపురం శాఖ కార్యదర్శి ఎస్కే జాన్‌పాషా, పర్వతనేని కాంతారావు, మోరంపూడి రామారావు, వుసికెల బాలకృష్ణ, ఏచూరి కాటయ్య, గుంజి నాగేశ్వరరావు, వరివల్లి రమేష్, గుంజి నరసింహారావు, మల్లయ్య, గరిమెళ్ల వెంకటేశ్వరరావు కుమారుడు శ్రీరాం మూర్తి, గ్రామ పెద్దలు దొడ్డా ప్రసాదరావు, వల్లభనేని భద్రరావు, తుమ్మల రమణారావు, ఆళ్లూరి ప్రసాద్, మోరంపూడి చెన్నారావు, నల్లమోతు ప్రసాద్‌తో పాటు గరిమెళ్ల బంధువులు, మిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకులాల్లో నాసిరకం సరుకులపై ఆరోపణలు"




ఖమ్మం,సెప్టెంబర్ 19 (తెలుగుగళం): గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ ఆరోపించారు. నేకాఫ్ సంస్థకు రూ.900 కోట్ల నిత్యావసర సరుకుల కాంట్రాక్టు ఇవ్వడంపై అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జీవో 17ను రద్దు చేసి సిట్ ఏర్పాటు చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నాసిరకం సరుకుల సరఫరాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే తల్లిదండ్రులు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఘనంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం

- న్యాయ సేవల విస్తరణకు మరో ముందడుగు
- నూతన కోర్టుతో స్థానికులకు మరింత సౌకర్యం





తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం లో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు భవనాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, మహబూబాబాద్ జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ ఈ వి. వేణుగోపాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు, జస్టిస్ బి.ఆర్.మధుసూదన్ రావు విశిష్ట అతిథులు గా పాల్గొన్నారు,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు,కోర్టు సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా హైకోర్టు జస్టిస్ ఈ వి.వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ కోర్టు పరిధిలో ప్రస్తుతం 1903 కేసులు ఉన్నాయని, మరో మారు తాము కోర్టు సందర్శించే సమయానికి 1000 కేసులు పరిష్కరించేలా పనిచేయాలన్నారు, జ్యుడిషరీలో బెంచ్,బార్ రెండు కలిసి కచ్చిదారులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు,న్యాయమూర్తులు మాట్లాడుతూ న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే కోర్టుల ఏర్పాటులో ప్రధాన ఉద్దేశమన్నారు.స్థానికంగా కోర్టు అందుబాటులోకి రావడంతో ప్రజలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కానుందని తెలిపారు. కేసుల విచారణ సత్వరంగా జరిగేందుకు ఇది దోహదపడుతుందన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,జిల్లా ఎస్పీ శబరిష్,కె.మురళీ మోహన్,ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ఉ సెషన్స్ జడ్జ్, మహబూబాబాద్ వి. వెంకటరత్నం బార్ అసోసియేషన్ తొౖరూర్,బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, ఆర్డీవో గణేష్, స్థానిక తహసిల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి,స్థానిక న్యాయవాదులు తోణుకునూరి సైదులు, ఏ జి పి లింగాల శ్రీను, వంకుడోతూ శారదా ,బషీపంగు వెంకటేశ్వర్లు,అలవాల శ్రీశైలం,భూక్య శ్రీనివాస్,జీ వీరన్న,యం.ముకేశ్,సీనియర్ న్యాయవాదులు, బానోత్ లాలు నాయక్,పుల్లూరి కృష్ణయ్య,చిలుకమారి వెంకటేశ్వరు, శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాంపల్లి యాకయ్య జ్ఞాపకార్థం, వారి తనయుడు ,సూర్య పాఠశాల విద్యార్థుల కు టై, బెల్టుల పంపిణీ



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన రాంపల్లి యాకయ్య జ్ఞాపకార్థం వారి తనయుడు సూర్య కుమార్ గౌడ్ టై,బెల్టుల పంపిణీ చేశారు,ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు, తాను చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక రూపంలో సహాయం చేయాలని వారి తండ్రి జ్ఞాపకార్థంగా పిల్లలకు టై, బెల్ట్ లు పంపిణీ చేసారు అన్నారు,రాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో చదివే ఒకటి నుండి 5వ తరగతి పిల్లలు 75 మంది విద్యార్థిని విద్యార్థులందరికీ ఉచితంగా5000 రూపాయలు విలువచేసే టై, బెల్ట్, మరియు బ్యాడ్జి అందించడం జరిగింది. ఈ సందర్భంగా సూర్య కుమార్ మాట్లాడుతూ రాంపురం ప్రాథమిక పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నత విద్యార్హతలు కలిగి నైపుణ్యాలు నేర్పేటువంటి ఉపాధ్యాయులు ఉంటారని ఈ పాఠశాల యొక్క బలోపేతానికి ఉడత భక్తిగా తమ వంతు సహాయము చేశామని అలాగే రాబోయే కాలంలో కూడా తప్పకుండా పిల్లల మరియు పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతామని అన్నారు,ఈ సందర్భంగా సూర్యని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు,ఈ కార్యక్రమంలో మూడవ వార్డు సభ్యులు బోర సతీష్ యాదవ్,ఉపాధ్యాయులు గుర్రం వెంకన్న గౌడ్,రాజేశ్వరి,శ్రీధర్ గణేష్ ,క్రాంతి ,తల్లిదండ్రులు బందు పరశురాములు, గుండగాని బాబు,చింత మమత మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో రైతు దుర్మరణం"

**● లచ్చన్నగూడెంలో విషాదం.. ● దిక్కుతోచని స్థితిలో కుటుంబం"**



సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్19(తెలుగు గళం) న్యూస్:

పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ రైతు పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామంలో చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన పర్స ఆనందరావు (52, తండ్రి: అంజయ్య) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో దుక్కి దున్నేందుకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండగా పొలంలోనే ఉన్న ఆనందరావుపై పిడుగు పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆనందరావు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు పరీక్షించి నిర్ధారించారు.

ఆనందరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కూతుళ్లలో ఎవరికీ ఇంకా వివాహం కాలేదు. ఇంటి పెద్ద దిక్కు, కుటుంబాన్ని పోషించే ఏకైక ఆధారం పిడుగుపాటుకు బలికావడంతో ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. అప్పటివరకు కళ్లముందే ఉన్న వ్యక్తి విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో లచ్చన్నగూడెం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.